

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**ఆ రోజుల్లో మద్రాసు సినిమా** పని మీద వెళ్తే సుధారా హోటల్‌లోనే మకాం. త్యాగరాయనగర్ బస్సు స్టాండుకి ఎదురుగా ఉండే హోటల్ ఎ.వి.కె రెడ్డిగారిది. అప్పటికి ఆయన సవేరా హోటల్ నిర్మించలేదు. సి.నారాయణరెడ్డిగారికి సుధారాలో రాజ లాంఛనాలు లభించేవి. ఆయన ఎ.వి.కె మిత్రులు. నేనూ అంతే. ఆయన ఎప్పుడూ 12 నెంబరు గదిలో ఉండేవారు. నాది 11 నెంబరు గది. మా పనులు ముగించుకుని వచ్చి రాత్రులు కబుర్లు చెప్పుకునే వాళ్ళం సినారె. నేనూ. ఒకరోజు నేను రాత్రి 11.30కి వచ్చాను. అలికిడి విని రెడ్డిగారు వచ్చారు. "మీ గురించే ఆలోచిస్తున్నాను. ఓ ఆరునెలలు రేడియోకి శలవు పెట్టి మద్రాసులో ఉండకూడదూ – ఫీల్డులో రచయితలు దొరక్క నలిగిపోతున్నారు" అన్నారు.12.30 వరకూ కవితాగోష్టి. రకరకాల గేయాలు చదివారు రెడ్డిగారు.

మరునాడు ఎమెస్కో ఎమ్.ఎన్.రావుగారు వచ్చారు. "మళ్ళీ మూడో నవల ప్రారంభించండి" అన్నారు.

బాలాంత్రపు నళినీకాంతరావుగారిని పిలిచారు. ఆయన 'మెయిల్' దినపత్రికలో పనిచేశారు. 'వెన్నెల కాటేసింది' మీద ఆయన సమీక్షకి కృతజ్ఞత చెపితే "నా సమీక్ష మీ నవలకి దక్కాల్సిన అభినందనని సరిగా ఇవ్వలేకపోయిందని నా బాధ" అన్నారు.

అప్పుడు దాశరథిగారు మద్రాసు రేడియో స్టేషన్‌లో తెలుగు విభాగంలో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్. "అబ్బాయి నువ్వు వచ్చి కొన్ని కథలు చదువు" అన్నారు. "మీరొక్కసారి ఆ కథల్ని రికార్డు చేసేముందు చదివితే బాగుంటుంది" అన్నారు. దాశరథిగారికి కోపం వచ్చింది. "మారుతిరావు కథలు దాశరథికి నచ్చకపోవడం ఏమిటబ్బాయ్! నిజానికి నీ 'పిడికెడు ఆకాశం' అంతా 16 భాగాలుగా రేడియోలో చదివించాలని ఉంది, నీ 'వెన్నెల కాటేసింది' అయినా సరే" అన్నారు.

అభినందన సరే, స్నేహం కోసం, తను అభిమానించిన వ్యక్తికోసం ప్రాణం ఇచ్చే మనిషి దాశరథిగారు. కవిగా దేశం ఆయన్ని నష్టపోయి ఉండవచ్చు. కాని నన్ను ఎప్పటికప్పుడు నడిపించి, ప్రేమించే పెద్దన్నగారిని నష్టపోయిన బాధ నాది. అటువంటి వ్యక్తులు అరుదుగా తారసపడతారు జీవితంలో.

ఆ రోజుల్లో నేను విజయవాడ కేంద్రంలో రాసిన మరో నాటిక ఓ చరిత్ర. దాని పేరు – సర్వే స్టోన్ 23. ఈ నాటికలో దాదాపు విజయవాడలోని కళాకారులంతా పాల్గొన్నారు.

హైదరాబాదులో ఉన్నప్పుడు నాగార్జున సాగర్ రోడ్డులో స్థలం కొనడానికి వెళ్ళాను. అక్కడ ఈ సర్వే నంబరు ఉన్న చిన్న బోర్డు చూశాను. విశాలంగా ఉన్న స్థలంలో దూరంగా ఏవో శిధిలాలు ఉన్నాయి. ఈ స్థలానికేమయినా చరిత్ర ఉందా అనిపించింది. ఉంటే! అప్పుడు మనస్సులో 'సర్వే స్టోన్ 23' పుట్టింది. విజయవాడలో బందాగారు 'స్పెషల్ క్వార్టర్లీ ' నాటకం వ్రాసి ఇవ్వమన్నప్పుడు ఈ రచన చేశాను. 'కళ్యాణి' లాగే ఇది అయిదు కేంద్రాల నుంచి ప్రసారమయే ప్రత్యేక నాటకం. నాకు చాలా ప్రియమయినదీ, ఎన్నో జ్ఞాపకాల సంపుటి ఈ నాటకం. 30 ఏళ్ళ తరువాత ప్రయాగ నరసింహశాస్త్రిగారి  కూతురు శ్రీమతి వేదవతి స్టేషన్ డైరెక్టరు అయింది. ఈ నాటికని లైబ్రరీలో వెదకమన్నాను. చూసి లేదన్నది. హతాశుడినయాను. ఆనాటి రేడియో వైభవాన్ని చెప్పే ప్రయోగం ఈ నాటిక.

స్థూలంగా కథ ఇది: ఒక ఉద్యోగి ప్రతిరోజూ ఒక ఖాళీస్థలం ముందు  నుంచి సైకిలు మీద ఆఫీసుకి వెళ్తూంటాడు. ఒకరోజు రెవెన్యూ ఉద్యోగులు ఆ స్థలం కొలతలు తీస్తున్నారు. ( ఆ రెవెన్యూ ఉద్యోగి బందా) ఆ స్థలానికి గుర్తుగా 'సర్వే స్టోన్ 23 ', రాటని పాతుతూంటారు.

ఆ స్థలంలో శిధిలమైన కోట – అతని మనస్సులో నిరంకుశుడూ, శాడిస్టూ అయిన చక్రవర్తి (సినీనటులు ముక్కామల కృష్ణమూర్తి అన్నగారు ముక్కామల అమరేశ్వరరావు చేశారు). ఒక నర్తకిని నాట్యం చెయ్యలేని కారణాన కోట గోడ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోమని శాసిస్తాడు. (వి.బి కనకదుర్గ 'నర్తకి') ఆమె పాడిన పాటని రాచకొండ నరసింహమూర్తిగారు రాశారు. వోలేటి సంగీతం చేశారు. శ్రీరంగం గోపాలరత్నం పాడారు.

ఫ్లాష్‌బాక్ ముగిసింది. ఇప్పుడక్కడ ఒక కల్లుపాక వెలిసింది. రాజప్రాసాదాలు కూలి, జీవితం నేలమీద కాలుమోపింది. నేలబారు బ్రతుకులు, వారి మధ్య నేలబారు అనుబంధాలు – ఇదీ వృత్తాంతం. ఈ ఘట్టం కొడాలి ఆదిశేషయ్య, నేనూ నటించాం.

కాలం గడిచింది. కొన్నేళ్ళకి ఎవరో స్వామి వచ్చి అక్కడ కూర్చున్నాడు. చిన్న ఆశ్రమం వెలిసింది. భక్తులు వచ్చారు. మనశ్శాంతికీ, అహింసకీ స్వామి కొత్త అర్థాలు చెప్పారు. ఈ పాత్రని నల్లాన్ చక్రవర్తుల జగన్నాథాచార్యులు వేశారు.'ఉద్యోగి రిటైరయి ఇంటికి బయలుదేరేనాటికి మళ్ళీ ఆ స్థలం 'సర్వే స్టోన్ 23' అయిపోయింది. జీవన పరిభ్రమణాన్ని మూడు దశలలో ఆవిష్కరించిన నాటకం అది.

శ్రీరంగం గోపాలరత్నం తనదయిన భాషలో చేసిన ప్రశంస "కచ్చేరీలో మంచి గమకమో, కళో వినిపించినప్పుడు 'ఓహో' అంటాం. అలాగ నాటకం వింటున్నంతసేపూ మంచి డైలాగు వచ్చినప్పుడల్లా 'ఓహో' అంటాం. అలాగ నాటకం వింటున్నంతసేపూ మంచి డైలాగు వచ్చినప్పుడల్లా 'ఓహో ' అంటూ విన్నాను."

ఈ దశలో నేను నష్టపోయినదీ, అతి ముఖ్యమైనదీ ఒకటుంది – వ్యక్తిగత జీవితం. ఇల్లు, భార్య, పిల్లలు నా దైనందిన జీవనంలో భాగమే కాని ఏనాడూ ఫోకస్‌లో లేకపోవడం. ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే అది దురదృష్టంగా భావిస్తాను. ఎప్పుడయినా షికరుకో, సినిమాకో, మరే వినోదానికో వెళ్ళినా నా వ్యాసంగం మధ్య చిన్న వ్యవధిగానే సాగేది. పిల్లలూ తల్లికి దగ్గరగానే ఉంటూ వచ్చారు. నేను చేసే పని విలువయినదీ, నేను సాధించేది అరుదయినదీ అని వారికి అనిపించినా నేను ఆ దశలో నష్టపోయిన దానికి అది ప్రత్నామ్నాయం కానేకాదు.

పిల్లలకి పండగలకి ఏ బట్టలు కొనాలి? ముగ్గురి పిల్లలలో ఎవరికి ఏది యిష్టం? వాళ్ళు ఏం కావాలని అడిగేవారు? చదువులు ఎలా సాగేవి? నాకు తెలిసేది కాదు. నన్ను పిల్లలు ఎప్పుడూ ఏదీ కావాలని అడిగిన గుర్తులేదు. సంవత్సరాల తర్వాత మా వాసూ పోయాక పిల్లలు స్కూలు నుంచి రాగానే ఏం చేసి పెట్టేదో, ఎవరు ఎలా అల్లరి చేసేవారో, బట్టలు పాడుచేసుకు ఎవరు వచ్చేవారో, వాసూ ఎంత అల్లరి చేసేవాడో ఇవన్నీ ఓ అద్భుతమయిన కథలాగా మా ఆవిడ చెప్తూంటే ఇప్పుడిప్పుడు వింటూంటాను.

"ఎవరు ఏం అడిగేవారు? ఏ బట్టలు కొనేదానివి?" ఇలంటి ప్రశ్నలకి సమాధానాలు మా ఆవిడ చెప్తూంటే ఓ గొప్ప అవకాశాన్ని పోగొట్టుకున్న వాడిలాగా అనిపిస్తుంది. ఇందులో నా పాత్ర ఉంది. నిజానికి ఈ పాత్ర నాది. కాని నేను దాని విలువ తెలుసుకోలేని దశలో నష్టపోయిన ఆనందం.

నాకు పద్మభూషణ్ బిరుదు రావచ్చు. నోబెల్ బహుమతి రావచ్చు. మళ్ళీ జీవితమంటూ ఉంటే పిల్లల చెయ్యి పుచ్చుకుని కాలాన్ని పంచుకునే అద్భుతమయిన ఆనందం కోసం వాటిన్నిటినీ తేలికగా వొదులుకుంటాను. ముఖ్యంగా మా వాసూతో – ప్రయత్నించినా ఇప్పుడు చెయ్యలేను కనుక.

ఇది సాహితీపరుడుగా చెల్లించిన అమూల్యమయిన మూల్యం.

9

ఇది జీవితంలో ఉక్కురిబిక్కిరి చేసిన దశ. అన్ని పక్కలా సినిమాలూ, నాటకాలూ, నవలలూ, సభలూ, ఉద్యోగం – ఒక్కక్షణం ఈ దశలో డైరీలనే యథాతథంగా ప్రచురిస్తే బాగుంటుందనిపించింది. గుర్తు చేసుకునే సందర్భమో, సన్నివేశమో జరగకుండా ఏ రోజూ గడవలేదు.

ఎవరు ఆలోచన చేశారో గుర్తు లేదు కాని (పురాణం అనుకుంటాను) ఆంధ్రజ్యోతి వారపత్రికలో గొలుసు నవల వ్రాయాలని పురాణం, నేనూ, కొమ్మూరీ అనుకున్నాం. ముగ్గురం కలిసి ఒక్కసారి – ఒకే ఒక్కసారి మాట్లాడుకున్న గుర్తు. పురాణం నవలని ప్రారంభించారు. ఇతివృత్తం, పాత్రీకరణలూ ఆయనవి. మరో వారానికి పూర్తవుతుందనగా నాకు అందించారు. ఆయన రాసింది చదువుకుని నేను ప్రారంభించాను. కొనసాగించడం, ముగింపు వేపుకు ప్రయాణం అంతా నాది. ముగింపు కొమ్మూరిది.

నేను మొదలుపెట్టిన అధ్యాయం మొదటి వాక్యానికే నాకో అభిమానినుంచి ఉత్తరం వచ్చింది. దాశరధిగారిది: "ఇడియట్ చక్కని ట్విస్ట్‌స్‌తో, టర్న్‌స్‌తో రమణీయంగా ఉంది. లెగ్ హార్న్ కూత సాయంత్రంపూట తెల్లవారిందని దొంగసాక్ష్యం ఇస్తున్నట్టుండడం భేష్‌గా ఉంది" అని రాశారు. ఈ నవల మా ముగ్గురు రచయితల్ని ముగ్గురు ఇడియట్స్‌ని చేసేసింది. యద్ధనపూడి సులోచనారాణి "మీ మూడో ఇడియట్ ఎలా ఉన్నారు?" అని పలకరించేవారు – కొమ్మూరి ప్రసక్తి వచ్చినప్పుడు.

'ఇడియట్' నవల మీద హైదరాబాదు కళాభవన్‌లో విశ్వసాహితీ బృందం చర్చావేదికని ఏర్పాటు చేసింది. పంచాయితీరాజ్ కార్యదర్శి ఐ.జె.నాయుడు ఐయ్యేయస్ (తరువాత చీఫ్ సెక్రటరీ అయారు) సభా నిర్వాహకులు. పాత్రికేయులు, మిత్రులు పి.యస్.ఆర్ ఆంజనేయశాస్త్రిగారు చక్కని పేపర్ చదివారు. కొలిపాక మధుసూధనరావు, మహీధర జగన్మోహనరావు ప్రసంగించారు. చివరలో నేను సమాధానం చెప్పాను.

విజయనగరంలో చాగంటి సోమయాజులుగారు నన్ను అంట్యాకుల పైడిరాజుగారితో " ఈ మాటు తీరికగా వచ్చినప్పుడు రండి" అన్నారు.

స్వయంగా తాము చేసిన శిల్పాలను చూపారు. తల్లి పిల్లని లాలిస్తున్న విగ్రహం అద్భుతం. "ఏదో inspiration వచ్చినప్పుడల్లా రాసేస్తూంటాను" అన్నారు.

"బాగుంది. జీవితంలోంచి కళని రాబట్టి మళ్ళీ దాన్ని జీవితానికే అందంగా పొదుగుతున్నారు" అన్నాను.

"ఇల్లు మరమత్తులు చేయిస్తున్నాను – మార్పులతో. మళ్ళీ మీరొచ్చేసరికి ఇల్లు మారిపోతుంది" అన్నారు. మళ్ళీ ఆయనింటికి వెళ్ళడం పడలేదు.

ఆంధ్రజ్యోతి ఆఫీసులో ఎప్పుడు తటస్థపడినా పలకరించి, నిలబడి, ప్రశ్నలు అడిగేవారు నార్ల. ఓసారి గదిలోకి పిలిచి "వేమన మీద వ్యాసం రాశాను. చదివి ఎలా ఉందో చెప్పండి" అన్నారు కాగితాలు చేతికిస్తూ. మరోసారి వీరేశలింగం మీద ఆయన రాసిన మోనోగ్రాఫ్ (సాహిత్య అకాడమీ కోసం వ్రాసినది) ఇచ్చారు. నార్లవారు వ్యక్తిగతమయిన నీతికీ, శీలానికీ ఎక్కువ విలువనిచ్చేవారు. ఇందుకు ఏమాత్రం భిన్నంగా ఉన్నా ఆ వ్యక్తిని శత్రువుగా భావించేవారు. ఉదాహరణకి గురజాడ, వీరేశలింగం గార్లమీద ఆయనకి నిర్దుష్టమయిన అభిప్రాయాలుండేవి. ఏనాడయినా వ్యక్తిగా వీరేశలింగంగారికి పెద్ద పీట వేసేవారు. గురజాడది రెండోస్థానం. రచయితగా గురజాడది మొదటి స్థానం. అలాగే ఎమర్జెన్సీ తర్వాత ఇందిరాగాంధీ పేరుని కూడా తట్టుకోలేకపోయేవారు – ఎమర్జెన్సీ అమలు చేసిన కారణంగానే.

నేను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆయన నాటిక నొకదాన్ని షెడ్యూలు చేయదలిచి ఆయనకి ఉత్తరం రాశాను. వెంటనే సమాధానం వచ్చింది. ఇందిరాగాంధీ ప్రభుత్వంలో తన నాటికని రేడియోలో ప్రసారం చెయ్యడానికి ఎంతమాత్రమూ అంగీకరించనని. ఆయన ఆవేశానికి ఆశ్చర్యపోయాను. 1977లో ఇందిరాగాంధీ ఓడిపోయాక ఆయనే ఉత్తరం రాశారు. ఇప్పుడు కావాలంటే తన నాటికని ప్రసారం చెయ్యొచ్చునని. ఒక పత్రికా సంపాదకుడిగా, వ్యక్తులమీదా, సిద్ధాంతాల మీదా, నిర్దుష్టమయిన అభిప్రాయాలు ఉండొచ్చుగాని అవి ఎంతో కొంత పత్రికని, పాలసీని ప్రభావితం చెయ్యక తప్పదు. అందుకనే నార్లగారికి 'కింగ్ మేకర్'గా పేరుండేది. అంతేకాదు. ఆయన సంపాదకీయాలు ఆవేశంతో, నిర్దుష్టమయిన అభిప్రాయాలతో కరకు కత్తులలాగా ఉండేవి. ఆయన సంపాదకీయాలకు ప్రత్యేకమయిన అభిమానులుండడం నాకు తెలుసు.

ఆయన గురజాడ వ్రాతప్రతులు, డైరీలు తెప్పించారు. వాటిని పరిష్కరించడానికి నన్నూ, పురాణాన్నీ ఇంటికి ఆహ్వానించారు. జీవితంలో అదొక అపూర్వమయిన అవకాశం, అదృష్టం.

రోజూ వారింటికి ఉదయమే వెళ్ళేవాళ్ళం. ఇంటినిండా వేలాది పుస్తకాలు. ఖాళీ ఉన్న ప్రతీ స్థలంలోనూ పుస్తకాలే కనిపించేవి. పుస్తకాల గూటిలోకి వచ్చి ఆయనా, భార్యా కాపురం చేస్తున్నారనిపించేది. వారి భార్య సులోచన. చల్లని తల్లి. ఎంతమంది మహానుభావులకి ఆ ఇంట్లో ఆతిథ్యం ఇచ్చారో ఆవిడ. రుచికరమయిన టిఫినూ, కాఫీ ఇచ్చేవారు. గురజాడకంటే ఆమె ఆతిథ్యానికే ఎదురు చూసేవాడిని. గురజాడ మీద ఆయన వ్రాసినవి చదివేవారు. ఆయన డైరీలని

అవసరాల సూర్యారావుగారు ఎంత అసందర్భంగా, అసమగ్రంగా అనువదించారో సోదాహరణంగా చెప్పేవారు. గురజాడ ఇంగ్లీషు ఆయనకి అర్ధం కాకపోవడం, వ్రాతప్రతులని సరిగ్గా చదవలేకపోవడం – ఏమయినా కారణాలు కావచ్చు.

డైరీలు చదవడం ప్రారంభించాం. కొన్ని తిప్పి రాశాం. కొన్ని వర్ణనలను గురజాడ అపూర్వంగా రాసుకున్నారు. తన డైరీలలో. వీటన్నిటికీ తోడు నార్లగారు మధ్య మధ్య చెప్పే సంఘటనలు – అదో పెద్ద విందు.

రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ఓసారి పితాపురం రాజా విషయంలో సిఫార్సుకి తన శిష్యుడే అయిన జస్టిస్ ముత్తా వెంకట సుబ్బారావుగారి దగ్గరకి వచ్చారట. ఒక వీక్ మూమెంట్‌లో, మాటల సందర్భంలో ఆ ప్రసక్తి తెస్తే సుబ్బారావుగారు లేచి నిలబడి, గురువుగారికి చేతులు జోడించి, "ఆ పని మాత్రం నాకు చెప్పొద్దు" అన్నారట. అంతే. నాయుడుగారు భోరున ఏడ్చేసారట. "ఈ బలహీనతకి నేనే లొంగిపోయాను. నేను నీకు గురువుని కాను. నువ్వే నాకు గురువువి" అని కాళ్ళు పట్టుకోబోయారట. సుబ్బారావుగారు కూడా ఆయన్ని చూసి ఏడ్చేసారట. ఇలాంటి సంఘటనలు నార్లగారికి అతి ప్రియమయినవి. దానిని బట్టి ఆయన వ్యక్తిత్వాన్ని మనం బేరీజు వెయ్యవచ్చును.

గురజాడ వారి డైరీలలో ఒకచోట వీరేశలింగంగారి శీలం మీద ఒక 'విసురు' వుంది. దానిని అవసరాల సూర్యారావు అనువదిస్తూ "వీరేశలింగం అనుచరులు" అని తప్పించుకున్నారు.

గురజాడకి ఇంగ్లీషు సాహిత్యం మీద ప్రవేశం తెలియడానికి ఒక్క గిరీశం పాత్ర చాలు. ఆ పాత్ర దాదాపు 115 సంవత్సరాల క్రిందట ఆయన మనస్సులో రూపుదిద్దుకుందంటే కవి కాలం కంటే ఎంత ముందుండగలడో అర్థమవుతుంది.

గురజాడ తన వ్యక్తిత్వాన్ని తన మాటల్లోనే చాలా చక్కగా విశ్లేషించుకున్నారు: I have great faith in work, work as the carver of the path uphill, work as the means of impairing conviction, to the minds of those, whose approbation we want. I have no sympathy for people, who whine for want of advancement while lapsing into indolence. With me, work has become a habit, en end in itself. నార్ల వారి దగ్గర కూర్చుంటే రోజూ ఎవరో ఒకరు వచ్చిపోయేవారు – ఆచంట జానకీరాం, గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రభృతులు.

నేను మధ్య మధ్య సినిమా పనులకి వెళ్ళినా పురాణం పని కొనసాగించేవారు. నార్లగారు "సీత జోస్యం"లాంటి పురాణవైర యితివృత్తాలను మాకు వినిపించేవారు. ఆయన ఆదర్శవాది. తను నమ్మిన నిజానికి పట్టుదలగా

నిలిచేయోధుడు. అద్భుతమయిన పాత్రికేయులు. అయితే మౌలిక రచయితగా ఆయన్ని రెండో స్థానంలోనే ఉంచుతాను నేను.

ఒకసారి నాకూ, పురాణంకూ "పంచరాత్రం" అనే నాటిక వినిపిస్తూ ఆయన చెప్పిన మాటలు" "మీరు సంభాషణలు బాగా రాస్తారు. కాని సన్నివేశాలు అవాస్తవంగా ఉంటాయి. కొన్ని అసందర్భమయినవీ ఉంటాయి. కాని నాటకీయమయిన సన్నివేశాలూ, సంభాషణలూ వ్రాస్తారు. నా నాటకాల్లో వాస్తవికత మొతాదు ఎక్కువయి సంభాషణలు మరీ ఫ్లాట్‌గా ఉంటాయి. ఈ I err on this side" ఇదీ నార్లగారు నిజాయితీగా గీసుకున్న self – portrait

ఒకసారి ఆంధ్రజ్యోతికి వెళితే "మీతో మాట్లాడాలి ఉండండి" అన్నారు. తర్వాత గదిలో నేనూ, పురాణం, నార్ల చాలాసేపు మాట్లాడుకున్నాం.

"సినిమాలు రాస్తున్నారట. ఎంత సంపాదించారు?" అన్నారు.

"15వేలు" అన్నాను.

"మంచి ఇల్లు కట్టుకోండి" అన్నారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments